నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, శనివారం 12 అక్టోబర్ 2024 HYDERABAD



### పటాకుల విక్రయ దుకాణాల లైసెన్స్‌ల కోసం

## 26లోగా దరఖాస్తు చేసుకోండి

సిటీబ్యూరో: దీపావళి సందర్భంగా తాత్కాలిక పటాకుల విక్రయ దుకాణాల లైసెన్స్‌ల కోసం ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆ తరువాత దరఖాస్తులు స్వీకరించరని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి ఆయా డీసీపీల ద్వారా లైసెన్స్‌లు జారీ అవుతాయన్నారు. డివిజనల్ ఫైర్ ఆఫీసర్ నుంచి ఎన్‌ఓసీ, ప్రభుత్వ స్థలమైతే బల్దియా నుంచి ఎన్‌ఓసీ, ప్రైవేట్ వ్యక్తుల స్థలమైతే ఆయా యాజమాన్యాల నుంచి ఎన్‌ఓసీ, అగ్రిమెంట్ కాపీలు, గతేడాది జారీ చేసిన లైసెన్స్ ఉంటే ఆ కాపీని పెట్టాలి, సింగిల్ దుకాణం ఉంటే పక్క వారి నుంచి ఎన్‌ఓసీ, షాప్ సైట్ ప్లాన్, రూ.600 లైసెన్స్ ఫీజు గన్‌పౌండ్రీలోని, ఎస్‌బీహెచ్‌లో హెడ్ అకౌంట్‌లో జమ చేయాలని సూచించారు. సూచించిన వాటలో ఏమైనా డాక్యుమెంట్లు దరఖాస్తుతో పాటు లేకుంటే ఆయా అర్జీలు తిరస్కరిస్తామన్నారు.



పండుగ రద్దీ.. శుక్రవారం ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ఉప్పల్ చౌరస్తా





శిథిలాల మధ్య చిన్నబోయి కూర్చున్న గర్భిణి

# శిథిల బతుకులు

## పండుగకు నోచుకోని హైడ్రా బాధితులు

### మ బతుకుల్లో మట్టిగొట్టిన సర్కార్

### శిథిలాల మధ్య చిమ్మచీకట్లో బతుకీడుస్తున్న బక్క జీవులు

'మన తెలంగాణలో పెద్ద పండుగ దసరా.. చేసుకుందామంటే ఊరికి పోలేం.. ఇక్కడ ఉండలేం. సర్కారు మా బతుకుల్లో మట్టిగొట్టింది. అసలు బతుకే లేకుండా చేసింది. పోయిన ఏడాది ఇదే టైంకు ఊళ్లో దసరా పండుగ చేసుకుంటున్నం. ఇప్పుడు మా గతి ఇట్లయిపాయె.. రేవంత్‌రెడ్డికి మేం ఏం అన్యాయం చేసినం. మా మీద పగబట్టిండు. పిల్లగాళ్లు దసరా చేసుకుందం.. ఊరికి పోదాం పాండి అంటే చేతిలో చిల్లిగవ్వ లేకపాయె. ఉన్న ఇల్లు కూలిపాయె. ఎక్కడికని పోవాలే. ఎట్ల బతకాలే. మా జీవితాలు ఆగమైనయ్. పండుగ సంబురమే లేదు. సర్కారోళ్లకు మాపైన కనికరమే లేదు. మా గూడు కూలగొట్టి మమ్మల్ని రోడ్డు మీద పడేశారు'...హైడ్రా కూల్చివేతల్లో సర్వం కోల్పోయిన సున్నం చెరువు, నల్ల చెరువు బాధితుల ఆవేదన ఇది. ఎటుచూసినా కూలిపోయిన ఇండ్లు.. పడిపోయిన శిథిలాలు.. చిమ్మచీకట్లు అప్పుడప్పుడు వర్షాలు కురుస్తుంటే తామెలా బతుకాలో.. తామెక్కడకు పోవాలో తెలియని దుస్థితి.. అధికారులు బలవంతంగా ఖాళీ చేయించాలని చూసినా.. అక్కడి నుంచి వెళ్లే అవకాశం లేక అదే ప్రాంతంలో బతుకులీడుస్తున్న సామాన్యుల బాధ ఇది. -సిటీబ్యూరో, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ)



సున్నంచెరువు, నల్లచెరువు, ఇలా చాలా ప్రాంతాల్లో హైడ్రా దూకుడుగా వ్యవహరించిన తీరుతో బాధితులు విలవిలలాడిపోతున్నారు. ఎటుపోవాలో దిక్కుతోచక..రెక్కాడితే కానిడొక్కాడని జీవన పరిస్థితులను మార్చుకోలేక హైడ్రా కూల్చివేసిన ఇండ్ల శిథిలాల మధ్యే జీవనం కొనసాగిస్తున్నారు. హైడ్రా 23 చోట్ల 262 నిర్మాణాలను కూల్చివేసింది. సున్నంచెరువు, నల్లచెరువు.. ఇలా కూల్చిన ప్రతిచోటా శిథిలాలు అలాగే పడి ఉన్నాయి. గత రెండు నెలలుగా తామెక్కడకు పోవాలో.. ఎక్కడ బతుకాలో తెలియక తమ ఇండ్ల శిథిలాల మధ్యే దుర్భర జీవనం సాగిస్తున్నారు బాధితులు. కరెంట్ మీటర్లు తీసుకెళ్లడంతో ఆ ప్రాంతమంతా చీకటిమయమైంది. రాత్రైతే తాత్కాలిక గుడిసెల్లో పాముల భయం, దోమల బాధతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. దసరా పండుగ వస్తే ప్రతిసారి తమ ఊళ్లకు పోయి పండుగ బాగా జరుపుకునేటోళ్లమని, ఈసారి ఆ అదృష్టం తమకు లేకుండా పోయిందని కన్నీరుమున్నీరవుతున్నారు.

### శిథిలాల తొలగింపు జరిగేనా..

సుమారుగా మూడు నెలల కాలంలో హైడ్రా జరిపిన కూల్చివేతలకు సంబంధించిన శిథిలాలు ఎక్కడివక్కడే పడేసి ఉన్నాయి. కూల్చివేతలు, తొలగింపునకు సంబంధించి హైడ్రా గత నెలలో ఆఫ్‌లైన్ టెండర్లను పిలిచింది. ఈప్రక్రియ సెప్టెంబర్ 27తో ముగిసింది. అయితే ఇప్పటివరకు ఏ సంస్థకు టెండర్లు ఫైనల్ కాలేదని తెలిసింది.

### చేతిలో చిల్లిగవ్వ లేదు. : రాజు



మా బతుకులను రోడ్డు పాలు చేసింఢ్రు. మేం మా పిల్లలతో పాటు రోడ్డున పడ్డం. దసరాకు ఊరికి పోదామంటే చేతిలో చిల్లిగవ్వ లేదు.

### దసరా ఇనామ్ ఇది: విజయ్



దసరా పండుగ వస్తే ఇనామ్ తీసుకుంటం కదా.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి మాకు ఈ ఇనామ్ ఇచ్చిండు. మీరు ఇండ్లల్లో ఎందుకుండాలె. రోడ్డుమీదైతే బాగుంటదని ఉన్న ఇల్లు కూలగొట్టించిండు. దసరా గిట్లైపోయింది.

### అంతా పాయె.. ఇగ పండుగ ఎక్కడిది: లక్ష్మి



ఇల్లు మొత్తం కూలగొట్టిరి.. ఇగ పండుగ ఎక్కడిది. ఎక్కడ చూసినా రాళ్లే కనిపిస్తున్నయ్. మా బతుకు మొత్తం ఈ రాళ్ల మధ్యల అయిపోయింది. రాళ్ల మధ్యల నడుస్తుంటే నా చేయికి దెబ్బ తాకింది. కట్టు కట్టుకుని ఉన్న. పిల్లగాళ్లు దసరాకు ఊరికి పోయేటోళ్లు. ఈసారి మా ఇల్లు కూలగొట్టింఢ్రు. కట్టు బట్టలతోని బయటకు వచ్చినం.

### ఎక్కడికి పోవాలి: మహేశ్



ఇళ్లు కూలగొట్టి పోయింఢ్రు. మేం ఎక్కడికి పోవాల్నో తెలవట్లేదు. ఇక్కడనే చిన్న గుడిసె వేసుకుని ఉన్నం. నా భార్య గర్భిణి. నాకు చిన్న పిల్లగాడు. వీళ్లతోని ఈ రాళ్ల మధ్యల చీకట్ల బతకాలంటే భయమైతుంది. కరెంటు కట్ చేసింఢ్రు. పాములు, దోమలు.. ఇక్కడంతా దుమ్ము. రాత్రైతే చిమ్మచీకట్లో బయటకి పోదామన్నా.. భయమైతున్నది.

# నేడు దసరా.. ఏర్పాట్లు పూర్తి



సిటీబ్యూరో, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ) : అమ్మ ప్రేమానురాగాలను పంచుతుంది. పొరపాట్లను సహిస్తుంది. మార్గదర్శనం చేస్తుంది. మార్గంలో ఎదురయ్యే అడ్డంకులను ఎదుర్కొనే శక్తినిస్తుంది. నిర్మల భక్తితో తలిస్తే చాలు నేనున్నానంటూ వెలుస్తుంది. సకల శుభాలను అనుగ్రహిస్తుంది. అలాంటి జగన్మాత పండుగ నేడు. అదే దసరా. గ్రేటర్‌లో దసరా ఉత్సవాలకు అన్నీ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాలు జిలుగువెలుగులతో ముస్తాబయ్యాయి. పూల మార్కెట్లు, మిఠాయి దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. నగరంలో ప్రధాన కూడళ్లలో దసరా ఉత్సవాల ఏర్పాట్లు చేశారు. సాయంకాలం జమ్మి చెట్టు ఏర్పాటు వంటివన్నీ సిద్ధం చేశారు. మొత్తంగా దసరా సంబురాలు అంబరాన్నంటేలా జరుపుకోవడానికి నగరవాసులు ఉత్సాహంగా ఉన్నారు. ఒకరికొక్కరూ జమ్మి ఆకు పంచుకుంటూ.. అలయ్ బలయ్ తీసుకోనున్నారు.

# ప్రయాణం..కావొద్దు ప్రమాదం ..!


## సేఫ్ జర్నీకి జాగ్రత్తలు తప్పనిసరి



సిటీబ్యూరో, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ) : దసరా పండుగకు ఊరెళ్తున్నారా ? ఓ పక్క ఆర్టీసీ బస్సులు రద్దీ.. మరోపక్క రైళ్లు కిటకిట.. ఇంకో వైపు ట్రావెల్స్ భారీ వసూళ్లు.. వీటి మధ్య సొంత వాహనంలోనే హాయిగా ప్రయాణించడం మేలు అనుకొని నగరవాసులు తమ సొంతూళ్లకు బయలుదేరుతుంటారు. ప్రయాణించాల్సిన దూరం, మార్గంపై ముందస్తు ప్రణాళిక వేసుకుంటే ఎలాంటి ప్రమాదానికి గురి కాకుండా, హాయిగా గమ్యస్థానాన్ని చేరుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. వాహన పరిమితికి సరిపడా ఎంతమంది వెళ్లొచ్చో..అంతే మంది ప్రయాణిస్తే ఎలాంటి సమస్యలు ఎదురుకావని సూచిస్తున్నారు. రవాణా శాఖ అధికారులు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు. సీటుబెల్ట్, హెల్మెట్లు ప్రాణ రక్షకులు అని తప్పకుండా వాటిని ధరించాలని చెబుతున్నారు. మరోవైపు వాహన సంఘాలు సైతం సెల్ఫీ విత్ సీట్ బెల్ట్ కార్యక్రమంపై ప్రచారం చేస్తున్నాయి.

### ఈ సూచనలు పాటించండి..

- గమ్యాన్ని ఏ మార్గంలో చేరుకోవచ్చనే విషయంపై అవగాహన పెంచుకోవాలి. మార్గ సూచికలు ఉన్నా.. సరే ప్రత్యామ్నాయ ప్రయత్నాలు విరమించుకుంటే మంచిది. ప్రమాద జోన్‌లో అప్రమత్తంగా వ్యవహరించాలి. రోడ్డుకు ఎడమ వైపు ఏర్పాటు చేసే బ్లాక్ స్పాట్ సూచికలను గమనిస్తూ ఉండాలి.
- రాత్రివేళల్లో ప్రయాణం చేయాల్సి వస్తే అప్రమత్తంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు సాధారణ వేగంలోనే ఉండాలి. ఏకధాటిగా వాహనాలు నడపకుండా మధ్యలో కొంత విశ్రాంతి తీసుకోవడం మంచిది. నిద్రకు దూరంగా ఉన్నవారిని ముందు సీట్లలో కూర్చోబెట్టాలి. రాత్రివేళ ఎక్కువగా జరిగే ప్రమాదాలు ఆగి ఉన్న వాహనాలే కారణమవుతున్నాయి. ఎక్కడైనా మన వాహనాలను నిలపాల్సి వస్తే ఇండికేటర్లు ఆన్ చేసి ఉండటం శ్రేయస్కరం.
- ప్రయాణంలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలి. స్టెప్నీ తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.
- ప్రయాణం మధ్యలో వాహనం బ్రేక్‌డౌన్, ఇతర రిపేర్లు ఎదురైతే కారు ఏం కంపెనీయో దానిని బట్టి టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చు. ఆ టీం మీకు 3-4 గంటల్లోపు అందుబాటులోకి వస్తుంది. వివిధ కస్టమర్ల సేవా కేంద్రాల నంబర్లను మీ దగ్గర ఉంచుకోవాలి. ఫస్ట్ ఎయిడ్ కిట్ వెంట పెట్టుకోవడం మంచిది.



# క్యాన్సర్ బాధిత చిన్నారులకు అండగా ఉంటా

### 'రెయిన్‌బో' సందర్శనలో క్రికెటర్ సిరాజ్

సిటీబ్యూరో: 'ఈ చిన్నారులతో గడపడం చాలా సంతోషంగా ఉంది. క్రికెట్ మ్యాచ్‌లో కొన్ని సార్లు బాల్‌ను క్యాచ్ పట్టడం మిస్సైనప్పుడు మ్యాచ్‌కు నష్టం కలుగుతుంది. అదే క్రమంలో జీవితంలో ఆత్మవిశ్వాసం, మనోధైర్యం, భావోద్వేగాలు సమతుల్యతను కోల్పోవడం వల్ల క్యాన్సర్‌పై చేసే పోరాటం సన్నగిల్లే ప్రమాదం ఉంటుందని' అని ప్రముఖ క్రికెటర్ మహ్మద్ సిరాజ్ అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌ను ఆయన సందర్శించి, అక్కడ చికిత్స పొందుతున్న క్యాన్సర్ బాధిత చిన్నారులను పలకరించారు. దాదాపు గంటన్నరకు పైగా చిన్నారులతో గడిపిన సిరాజ్.. వారి తల్లిదండ్రులతో ముచ్చటించారు. బాధిత చిన్నారుల తల్లిదండ్రులు మనోధైర్యంతో ఉండాలన్నారు. క్యాన్సర్ బాధిత చిన్నారులకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు.

# ప్రతిపాదనలోనే.. అంగన్‌వాడీలు!



## 60 కేంద్రాలను ప్రతిపాదించిన సంక్షేమ శాఖ

మేడ్చల్, అక్టోబర్ 11(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నూతనంగా ప్రతిపాదించిన అంగన్‌వాడీ కేంద్రాలు ప్రతిపాదనలకే పరిమితమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో నూతనంగా 60 అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు 30 క్రష్ (బేబీకేర్) కేంద్రాల ఏర్పాటు కోసం సంక్షేమ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. అయితే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను మంజూరు చేయలేదు. స్లమ్స్ ఏరియాలతో పాటు వెనుకబడిన ప్రాంతాలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలు నివసించే బస్తీలు , గ్రామాలు, వాడల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తే ప్రజలకు మరింత ఉపయోగపడే అవకాశం ఉన్న నేపథ్యంలో సంక్షేమ శాఖ చర్యలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం నుంచి అనుమతి లభించలేదు. అలాగే అనువైన అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతనంగా క్రష్ (బేబీకేర్) సెంటర్లను ఏర్పాటు చేసేలా సంక్షేమ శాఖ చర్యలు చేపడుతున్నది. జిల్లాలోని సొంత భవనంలో విశాలమైన అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రష్ సెంటర్లను ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ఏర్పాటు చేయాలని చూస్తున్నారు.




### జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు..

మేడ్చల్ జిల్లాలో ప్రస్తుతానికి 793 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో మొత్తంగా 1,07,484 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఈ లబ్ధిదారుల్లో 0-6 ఏండ్ల చిన్నపిల్లలు 90,361 మంది ఉండగా గర్భిణులు, బాలింతలు 17,123 మంది ఉన్నారు. అయితే మరిన్ని నూతనంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటైతే మరింత మంది పేద ప్రజలకు ఉపయోగపడుతాయి. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో సంక్షేమశాఖ సర్వే నిర్వహించగా, మరిన్ని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు క్రష్(బేబీకేర్) సెంటర్ల అవసరం ఉందని సర్వేలో తెలినట్లు అధికారులు తెలిపారు. పేద ప్రజలకు మరింత సేవలను పెంచేందుకు అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు క్రష్ సెంటర్లను ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు వెల్లడించారు.

# పైసలిస్తేనే.. వార్డుల్లోకి

## ప్రభుత్వ దవాఖానల్లో కిందిస్థాయి సిబ్బంది చేతివాటం

### సెక్యూరిటీ గార్డుల తీరుతో బేజారవుతున్న రోగి సహాయకులు

సిటీబ్యూరో, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ దవాఖానలను ఆశ్రయించే నిరుపేద రోగులకు కిందిస్థాయి సిబ్బంది తీరు శాపంగా మారుతున్నది. అయినవారు అనారోగ్యానికి గురై దవాఖానలో చేరితే వారిని చూసేందుకు వచ్చిన వారి నుంచి నగరంలోని పలు ప్రభుత్వ దవాఖానల్లో ప్రవేశ ద్వారాల వద్ద ఉండే సెక్యూరిటీ గార్డులు ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, పేట్లబుర్జు, సుల్తాన్‌బజార్ దవాఖానల్లో వార్డుల వద్ద ప్రవేశ ద్వారాల్లో ఉండే సెక్యూరిటీ సిబ్బంది డబ్బులు ఇస్తేనే లోనికి అనుమతిస్తున్నట్లు రోగి సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగుల వద్దకు వెళ్లేందుకు పాస్‌లు ఉన్నా.. డబ్బులు ఇవ్వనిదే అనుమతించడం లేదని వాపోతున్నారు. ఒకవేళ గట్టిగా నిలదీస్తే నిర్ణీత సమయంలోనే రావాలని చెబుతున్నారని, డబ్బులు ఇస్తే మాత్రం సమయం, సందర్భాలేవి లేకుండా అనుమతిస్తున్నట్లు రోగుల సహాయకులు ఆరోపిస్తున్నారు.

### కనికరం చూపడం లేదు

రోగికి అత్యవసరమని చెప్పినా.. ప్రవేశ ద్వారా వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డులు కనికరించడం లేదని రోగి సహాయకులు వాపోతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల పేట్లబుర్జు ప్రసూతి దవాఖానలో చికిత్స పొందుతున్న రోగికి అత్యవసరమని చెప్పినా అక్కడి సెక్యూరిటీ సిబ్బంది అనుమతించకపోవడంతో సకాలంలో వైద్యం అందక సదరు రోగి మృత్యువాత పడ్డాడు. దీనిపై బాధితులు దవాఖాన అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పెద్దగా స్పందించలేదు. కాగా, నగరంలోని ప్రభుత్వ దవాఖానల్లో రోగులు, రోగి సహాయకులకు అక్కడ ఉన్న కొందరు కిందిస్థాయి సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గతంలో కూడా సెక్యూరిటీ సిబ్బంది, ఆయాల అవినీతిపై అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి అనేకసార్లు బహిరంగంగానే హెచ్చరించి, పలువురిపై చర్యలు తీసుకున్నా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు.

### ఆర్‌ఎంవోల అండదండలు

కొందరు ఆర్‌ఎంవోల అండదండలతోనే కింది స్థాయి సిబ్బంది రోగులపై తమ ప్రతాపం చూపిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సెక్యూరిటీ, శానిటేషన్‌కు సంబంధించిన సూపర్‌వైజర్లతో దవాఖానల్లోని కొందరు ఆర్‌ఎంవోలు కుమ్మక్కై వచ్చిన దాంట్లో పంపకాలు చేసుకుంటారని, దీంతో ఎక్కువగా కలెక్షన్లు చేసే వారిని ప్రవేశ ద్వారాల వద్ద నియమించి డబ్బులు వసూళ్లు చేయడంలో వారు పరోక్ష పాత్ర పోషిస్తున్నట్లు దవాఖాన వర్గాలే ఆరోపిస్తున్నాయి. కొందరు ఆర్‌ఎంవోల అండదండలతో సెక్యూరిటీ, శానిటేషన్ సూపర్‌వైజర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు కలెక్షన్లు అధికంగా వచ్చే వార్డులు, గేట్ల వద్ద తమకు అనుకూలమైన వ్యక్తులకు డ్యూటీలు వేసి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఈ స్థాయి వ్యవహారం ఎక్కువగా ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, పేట్లబుర్జు, సుల్తాన్‌బజార్ ప్రసూతి దవాఖానల్లో నడుస్తున్నట్లు తెలుస్తున్నది. కొందరు పై స్థాయి అధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు పాల్పడుతున్న అక్రమ వసూళ్లతో నిరుపేద రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు.

